రచన మాస పత్రిక – జనవరి, 2005

# ఎప్పటికీ ప్రేమికులే గొప్ప!

**బం**ధాల వెనకే ఉచ్చులనేవి ఉంటాయేమో? ఈ ఉచ్చులనేవి అయిన వాళ్ళనూ, అభిమానులనూ ఒకపక్కా, కానివాళ్ళను మరోపక్కా నిలబెట్టి నిశ్శబ్దంగా సరిహద్దు రేఖల్ని కూడా గీస్తాయంటారు.

అయితే మనకు తెలియకుండానే ఈ బంధాలు అప్పుడప్పుడు తను సరిహద్దు రేఖల్ని దాటడం చేస్తాయి. అప్పుడు మనుషుల మధ్య మనస్పర్థలు, ఘర్షణలు మొదలవుతాయి. ఈ సరిహద్దుల్ని దాటడం విషయంలోనే నేను మా రమేష్ అన్నయ్యతో పరోక్షంగా విభేదించాను. పరోక్ష యుద్ధం మా మధ్య అప్పుడే మొదలయింది. ఈ విషయం నా

భార్య లక్ష్మి పసిగట్టిందిలా ఉంది. చాలాసార్లు పరోక్షంగా ఆ విషయం నా ముందు ఎత్తింది. అయినా నేను మౌనం పాటించి, సహనం వైపు జరిగాను. అయినా లక్ష్మి నా విషయంలో తన సరిహద్దురేఖల్ని దాటి కాస్త ముందుకు వెళ్ళిందనిపించింది. అందుకే ఓసారి నేనూ నా తరఫు నుంచి నా సరిహద్దు రేఖల్ని దాటాను. తప్పలేదు.

"అన్నయ్యలోని మెతకదనమే అన్నిటికీ కారణం. అయినా తనకు పిల్లలు ఉన్నారు కదా.. మా అక్కా బావా వారి సంపాదనా చిన్నదేం కాదు. వారి కొడుకు ప్రదీప్‌ను తన ఇంట ఎందుకు ఉంచుకోవాలి?"

"ఎందుకు ఉంచుకోవాలంటే అది, ఆయన ఇష్టం"

"కన్నకూతురు శాంత అందగత్తె. దాన్ని చూస్తే చిదిమి దీపం పెట్టుకోవాలనిపిస్తుంది. ఎదిగిన కూతురు ముందు – మా ప్రదీప్‌గాడు తిరుగుతూ వుంటే, దానితో వెర్రిమాటలు మాట్లాడుతూ వుంటే నాకు అదోలా వుంటుంది."

"బావుంది. శాంత అప్సరసే ... ఆ ప్రదీప్ బావుండడు. నిజమే! అయితే ఏమవుతుంది?"

"వాడు శాంతకు ఏ విధంగానూ వరుడుగా సరితూగడు. కానీ ఆ విషయం వాడికి తెలియజెప్పడం ఎలా? ఓ అనాకారి ముందు ఓ అప్సరసను తిప్పితే రేపు ఏమవుతుందో? పైగా వాడికి మాట దూకుడు ఎక్కువ. కానీ మన శాంతది అందమైన స్వరూపమే కాదు, స్వభావం కూడా అందమైనదే! ఆమె ఓ గంట ఏ ఇంట తిరిగితే అక్కడ అందం తనుగా ఆనందంతో విజృంభిస్తుందనిపిస్తుంది. ఆమె మాటలకు ప్రకృతి తలఒగ్గినట్టూ అనిపిస్తుంది! పదహారేళ్ళ ఆ అప్సరసను చూస్తే నాకు ఎంతో ఆత్మతృప్తిగా ఉంటుంది. కానీ, ఆమె పక్క ప్రదీప్‌ను నా మనసు అసలు సహించదు. అందవిహీనంగా ఉండడం కాకుండా అందవిహీనంగా మాట్లాడ్డం కూడా ఓ దౌర్భాగ్యమేమో? అదే నా అయిష్టానికీ కారణం అయ్యిందనుకుంటాను."

కానీ మా రమేష్ అన్నయ్య ఇవేవీ గమనించడు. వినోద్‌ను తన ఇంట చదువుకు ఉంచుకున్నాడు. వాడిని తన పిల్లలకన్న ప్రేమగా చూస్తాడు. పైగా శాంతను ప్రదీప్‌తో ఆట పాటలకు ప్రోత్సహిస్తాడు. ఆ విషయంలోనే రమేష్ అన్నయ్యకూ, నాకూ మధ్య దూరం పెరగసాగింది!!

"మీకు ఆవేశం ఎక్కువ. అందరి విషయాలూ మీకే కావాలి. పైగా మీ హద్దులు మీకు తెలియవు. దాని మూలంగా మొదట మీరూ – ఆ తర్వాత నేనూ బాధపడాల్సి ఉంటుంది"

"బావుంది. వాళ్ళు మనకు పైవాళ్ళు కాదే? రక్తసంబంధీకులు. వాళ్ళు పరాకులోనో చిరాకులోనో పడి తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే చెప్పడం నా బాధ్యత అవదా?" అని అన్నాను చిరుకోపంతో నా భార్య లక్ష్మితో!

"మీ అన్నయ్యగారు పెద్దవారు. పైగా అనుభవజ్ఞులు. ఈ ప్రపంచాన్ని ఆయన మీ

కన్నా ఎక్కువగానే చూశారు. అలాంటి ఆయనకు మీరు సలహా యివ్వడం ఏమిటి? ఆయన ఏ ఒకటైనా మిమ్మల్ని అడిగితే మీరు అందుకు సలహా ఇస్తే ఆ అందం వేరు. కానీ ఇవ్వని పెద్దరికం భుజాన వేసుకుంటే ఆ తర్వాత భంగపాటును కూడా భరించ వలసి ఉంటుంది" అంది లక్ష్మి.

"లక్ష్మీ.... మళ్ళీ చెబుతున్నాను, విను. మా అన్నయ్య అమాయకుడనీ, మా వదిన తెలివితక్కువదనీ నాకేమీ అపోహలు లేవు. అన్నయ్య మంచివాడు. పైగా మెత్తనివాడు. వాడి పెళ్ళి కెదిగిన కూతురు శాంత. దానికి ఈ వేళ కాకపోయినా రేపైనా పెళ్ళి చేయాలి. దానికి ఇరవై మూడేళ్ళు దాటాయి. మా అన్నయ్య పైకి ఎంత గంభీరంగా ఉన్నా, అతని హృదయంలో దాగిన ఆటుపోటులు ఎలాంటివో నాకు తెలుసు. బాధ్యతలు అనేవి మనిషి తాలూకు భుజాలు ఎక్కి కృంగదీస్తుంటే ఆ బాధ తాలూకు సాంద్రత ఎంతటిదో నాకు తెలుసు. ఇది ఎవరూ ఎరుగని విషయమూ కాదు. అందుకే అయిన వాళ్ళు పక్కన నిలబడి అలాంటి వాళ్ళకు హమేషా ధైర్యం అందిస్తూ ఉండాలి. ఆ పనే నేను ఇంతకాలం చేస్తూ వచ్చాను.

"అప్పుడే లక్ష్మి - నా కళ్ళకు గడ్డిపువ్వు లాంటి ప్రదీప్ కన్పించాడు. నిజమే వాడు నాకూ అక్క కొడుకే? కానీ శాంత వేరు. ఆమె అందం, ఆకర్షణా వేరు. అలాంటి అప్సరసను వీడు ఆటలాడించడం, మాటలనడం, ఏడ్పించడం నాకు ఎందుకో బాధను కలగ జేసేవి. మన శాంత అయిష్టంగా బావ అయిన ప్రదీప్‌తో ఏదో తప్పదన్నట్టు సహ కరిస్తోందనీ నా అనుమానం! పైగా వాడు సుకుమారి అయిన శాంతను కొడ్తాడు. ఏడిపిస్తాడు. ఇవన్నీ ఈ కళ్ళతో చూసిన నాకు, నా అభిమానాన్ని శాంత, నా అసహనాన్ని ప్రదీప్ నాకు తెలియకుండానే పంచుకుంటూంటే నేనేం చెయ్యలేకపోయాను"

"ప్రదీప్ ఎవరండీ... మీ వాడు కాదా? అతను డిగ్రీ చేశాడు. ఉద్యోగం చేస్తున్నాడు. బాగుండకపోవడం, అందవిహీనంగా పుట్టడం అతని నేరాలు కాదు కదా? మీ ఆపేక్ష, నిరాదరణా రెండు కూడా ఏ వాద నకు నిలవవు సుమా?" అంది లక్ష్మి.

"ఏది ఏమైనా సరే శాంతను ప్రదీప్‌తో ముడిపెట్టకూడదు! చచ్చినా అలా జరగ కూడదు. అదే జరిగితే పెద్దవాళ్ళం కోరి దురదృష్టాన్ని ఆహ్వానించినట్టే, మర్చిపోకు.."

"ఏం ఆ అబ్బాయికేం అయ్యింది? నిజమే అతను అనాకారే.. కానీ మంచి దక్షుడు. ఇంటికి ఒక్కడే కొడుకు. చదువు ఉంది. ఆస్తి వుంది."

"శాంత నీ కూతురు కాదు. అందుకే నువ్వు తేలిగ్గా మాట్లాడుతున్నావ్? నోటి నుంచి కాదు - ప్రేగులు తెంచుకుని బయట పడేదే ప్రేమ, అన్నారు. అసలు వాళ్ళిద్దర్నీ భార్యాభర్తలుగా ఊహించడమే పాపం. ఏ పరిస్థితులలోనూ వాళ్ళు భార్యాభర్తలు కాకూడదు. ఈ దురదృష్టకరమైన పనికి పెద్దలు సహకరించకూడదు. పెళ్ళి అయిన తర్వాత నెమ్మదిగా వాళ్ళిద్దరి మధ్యా అయిష్టత పుట్టి, అది, అక్కడితో ఆగకుండా కన్నవాళ్ళకు అప్పులకు,

ఆపైన చుట్టూతా సంఘానికీ ఓ సమస్య అవుతుంది! అప్పుడు మనందరం ఏడవడానికి తప్పు, గింజుకోవడానికి తప్ప, మరి దేనికీ పనికిరాం".

"చాల్లెండి" అంది, లక్ష్మి, నెమ్మదిగా.

"ఇలాంటి భార్యాభర్తల్ని చాలామందిని చూశాను నేను. ముఖ్యంగా భర్తల ప్రవర్తన యిట్టే మారుతుంది. వాళ్ళ ఆలోచనలకూ, బుర్ర తిరుగుళ్ళకూ అర్థం చెప్పడం ఎవరి తరం కాదు. ఆడది - అందగాడైన తన భర్తను చూసి ఎంతో ఆనందిస్తుంది. గర్వపడుతుంది. కానీ ఆ పని మగవాడు చేయడు. చేయలేడు. భార్య అప్సరసగా వస్తే అప్పటి నుంచీ భర్తను లేని రోగాలు చుట్టుముడతాయి! అందులో మొదటిది - అనుమాన రోగం. భర్త శుద్ధ అనాకారి అయితే భార్య సుందరాంగి అయితే ఆ పోకడను భరించడం చాలా కష్టం. యెన్నో అపోహలు, అను మానాలు వీటితో మొదలయి ఆ సంసారం, నిత్యం, అల్పపీడన అతిపీడనను తట్టుకునే ఓ నావే అవుతుంది."

లక్ష్మి మళ్ళీ నవ్వింది, ఆ పైన నెమ్మదిగా అంది.

"భార్యాభర్తల కాపురానికి ఆలంబనగా నిల్చేవి అవగాహన, ఆత్మీయతానూ. అంత కుమించి మరేమీ కావు. ఈ మాటలు నా దగ్గర అంటే అన్నారుగానీ ఎవరి దగ్గరా అనకండి. ముఖ్యంగా మీ అన్నగారి వద్దా, వదినగారి దగ్గరా ఈ మాటలు అనొద్దు. అదే కాదు. మరీ మరీ ముఖ్యంగా, ఈ మాటలేవీ శాంత దగ్గర నోరు జారకండి. అందరూ కలసి మిమ్మల్ని అపార్థం చేసుకోవచ్చు. పైగా శాంత అందరి లాంటి అమ్మాయి కాదు. బాగా చదువుకుంది. తను పోస్ట్‌గ్రాడ్యుయేట్. ఎవర్ని పెళ్ళిచేసుకోవాలో, ఎవర్ని చేసుకోకూడదో, ఇలాంటి విషయాలన్నీ ఆమె మనసులో ఏనాడో ఓ అభిప్రాయాన్ని ఏర్పరచుకు ఉంటుంది"

"నువ్వు ఎరిగున్న వాళ్ళను, ఎరిగిన వాళ్ళనూ, మూకుమ్మడిగా సమర్థించుకుంటు వస్తావు. కానీ నన్ను మాత్రమే సమర్థించవు" అనేశాను.

లక్ష్మి నా వైపు చూసింది. ఆ పైన గుంభ నంగా నవ్వింది. ఆ తరువాతైనా ఆమెకు కోపం వస్తుందనుకున్నాను. కానీ రాలేదు!!

"నాకు వంటింట్లో పని ఉంది. వెడుతున్నాను. ఇక - మీరేమో ఆఫీసుకు వెళ్ళాలి. ఆ పని కానివ్వండి. అంతే.... అంతేగానీ అటూ ఇటూ ఎటూ వెళ్ళద్దు" అంది లక్ష్మి.

నేను చెయ్యి ఎత్తాను - నవ్వుతూనే! కానీ నా చేతికి లక్ష్మి తల దొరకలేదు. అయితే నాకు ఆమె నవ్వే చేత చిక్కింది. దాన్ని వెంట బెట్టుకుని నేను నవ్వుకుంటూ ఆఫీసుకు బయలుదేరాను.

❖ ❖ ❖

నేను ఆఫీసు నుంచి అన్నయ్యకు ఫోన్ చేశాను. రమేష్ అన్నయ్య ఫోనెత్తి, నా గొంతుకు గుర్తుపట్టి, "నువ్వు సాయంత్రం మా ఇంటికి వచ్చెయ్. మర్చిపోవద్దు. నీ గురించి చూస్తూ

ఉంటాను" అన్నాడు కొత్తగా. ఆ పైన కాసేపు ఆగి, "లక్ష్మిని కూడా తీసుకురా" అనేశాడు. ఆపైన, "విషయం చిన్నదే. కానీ ఆనందించదగ్గ విషయం. మన శాంతను ప్రదీప్‌కు యివ్వాలనుకుంటు న్నాను - అదీ ఈ ఒకటి రెండు నెలల్లోనే! ఎందుకంటే మన బావగారికి జబ్బు చేసి తగ్గిందిగా. ఈ శుభకార్యం జరిపిస్తే - ఆ ముహూర్త బలం వలన ఆయన కోలు కోవచ్చు" అన్నాడు.

"నువ్వు మన శాంతను ప్రదీప్‌కు ఇస్తావా?"

"ఇదేమిటీ? ఈ విషయం నీకు తెలియదా? ఇది అందరికీ తెలిసిన విషయమే కదా?"

"ఏమీ అనుకోకు అన్నయ్యా. ఆప్యాయతకు, నేనెటువంటి ఓటు వేస్తానో నీకూ తెలుసు. అందుకే ఆ ఆప్యాయతనే అడ్డం పెట్టుకుని నేను మాట్లాడుతున్నాను. పెద్ద వాళ్ళం - పిల్లలు పుట్టినప్పుడు లక్ష అనుకుంటాం. కానీ ఆ పిల్లలు ఎదుగుతారు. వ్యక్తిత్వం పోగేసుకుంటారు. మనలాగే వారికే మనసున్నా అది పసిమనసు. రోజూ మొగ్గలు వేస్తుంది. అందుకే వాళ్ళలో మార్పును మనం గమనించాలేమో"

"వాళ్ళిద్దరికీ ఒకళ్ళంటే ఒకళ్ళకు ఇష్టం అని నా నమ్మకంరా"

"కుందనపు బొమ్మ భార్యగా వస్తూంటే - కాదనడం ఏ మగాడు చేయడు. కానీ కుందనపు బొమ్మకు జోడీ కుందనపు బొమ్మే అవుతుంది. కానీ మట్టిబొమ్మ కాదుగా?"

నాలో ప్రదీప్ పట్ల నాకున్న భయాల్ని, అనుమానాల్ని, ఇంకా ఇంకా, బాధల్ని అన్నీ కలబోసి చెప్పి, ఆఖర్ని అన్నాను.

"వద్దు అన్నయ్యా. మన శాంత అప్సరస. కళ్ళకు అద్దుకోవాలనిపిస్తుంది, ఆ అందాన్ని! కానీ ప్రదీప్... అలా కాదే... వాడు ఫక్తు అనాకారి. వాడి మాట వింటేనే భయం వేస్తుంది? నేను ఏ విధంగా ఎంత ఆలోచించినా నాకు నేను ఎలా నచ్చచెప్పుకో బోయినా, వాళ్ళిద్దరి అనుబంధం నాకు ఆనందాన్నివ్వడం లేదు సరికదా - బాధనూ, భయాన్నే రేపుతోంది! ప్రదీప్ మన శాంతకు ఎక్కడా, ఏ కోణం నుంచి చూసినా అతకడు! నిజం...

"పైగా అటువంటి వాళ్ళ సంసారం, దాని ఆయుష్షూ కూడా అంతంత మాత్రమే అవుతాయని చాలామంది చెప్పగా నేను విన్నాను. ఇద్దరి మనుషుల మధ్య ఉండే దూరాన్ని తగ్గిస్తూ వారిని దగ్గరగా చేసేది పెళ్ళి! అంతేగానీ పెళ్ళిచేసుకున్న వారి మధ్యన ఉండే ఆప్యాయతను హరించి, ఆ దూరాన్ని పెంచుతూపోతే ఆ పెళ్ళికి ప్రయోజనమే ఉండదేమో? ఇక మన శాంత బాధపడితే, కన్నీరు కారిస్తే, ఆ కన్నీటిని కడతేర్చలేక నువ్వు బాధపడితే - ఆ పైన వదిన, ఇంకా ఇంకా దగ్గర బంధువులయిన మేం ఆ బాధను పెంచుకుంటూ, పంచుకుంటూ పోవడం వల్ల ఎవరికి లాభం? పైగా ఓ అప్సరస తను చేయని నేరానికి శిక్ష అనుభవిస్తే - మనం మన మొహాలు ఆమెకు ఎట్లా చూపిస్తాం? ఆమెను ఏ విధంగా ఓదారుస్తాం? చేయని నేరానికి తలఒగ్గి బాధను పోగేసుకునే శాంతను నువ్వేం చేయ గలవు? వదినేం చేయగలదు? బాబయ్యనయిన నేనూ, పిన్ని అయిన

లక్ష్మి - ఆమె కన్నీళ్ళు తుడవగలంగానీ - అవి పుట్టకుండా ఆపగలమా?"

అన్నయ్య ఫోన్‌లో చిన్నగా నవ్వి అన్నాడు.

"చిన్నప్పటినుంచీ వాళ్ళిద్దరూ కలిసిమెలసి ఉన్నారు. మన శాంత ఏనాడూ ప్రదీప్ బాగాలేడని మాతో అనలేదు"

నేను ఏమీ అనలేకపోయాను. కానీ అన్నయ్య నెమ్మదిగా అన్నాడు, నాతో.

"నీ ఊహల్లో కొద్దిపాటి నిజం ఉండొచ్చు కానీ అది పూర్తి నిజం అవదు! నువ్వు ఎక్కువగా ఊహిస్తున్నావేమోనని నా అనుమానం. ఇక కలతలంటావా, అనుమానాలంటావా, యివి మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా మన కుటుంబాల్లోకి దొంగల్లా చొచ్చుకుని వస్తూం టాయి! అయితే ఈ కలతలను కాదేనేది, తోసిరాజనేది ఒకటి వుంది! దాని పేరే ఆప్యా యత లేక ప్రేమ! కొన్ని కొన్ని సమయాల్లో యీ ఆప్యాయత, ప్రేమ అందాన్నీ, చందాన్నీ ఇంకా ఇంకా డబ్బునూ తోసిరాజంటుంది- అదీ నేర్పుగా! అందుకే వీటిమీద నాకంత మోజు! నిజమే - పైకి శాంతా ప్రదీప్ గొప్ప జోడిగా, తగిన జోడీగా కూడా కన్పడరు! కానీ వాళ్ళిద్దర్నీ ఆప్యాయతే అన్ని వేళలా చిటారు కొమ్మన కూర్చోబెడుతుందని నా ఆశ" అంటూ అన్నయ్య చాలా చెబుతూ వచ్చాడు నాకూ, లక్ష్మికీ.

ి ి ి

శాంత సరిగ్గా అప్పుడే వీధి తలుపు తోసుకుని వచ్చింది! ఆమె గుండె ఎగెసెగసిపడుతోంది! కళ్ళ వెంట చాలా కన్నీరు కారిందేమో, కొంత అక్కడే, దారితోనే ఆవిరి అయిన గుర్తులు కనిపిస్తున్నాయి. పైగా ఆ కన్నులు చింతనిప్పులా ఉండుండి మెరవడం నాకు భయాన్నీ, ఆశ్చర్యాన్నీ కూడా కలగచేశాయి. ఆమె చేతిలో విరిగిన చిన్న కర్రముక్క వుంది.

"ఏమయ్యింది అమ్మా... శాంతా" అన్నాను, నేను నెమ్మదిగా.

"ఏం అయ్యిందని చెప్పను? అవకూడ దనిదే అయ్యింది. జరగకూడదనిదే జరిగింది, బాబయ్యా..."

"ఏమిటమ్మా" ఆతృతగా అడిగాడు అన్నయ్య.

"నేను నీ ప్రియతమ మేనల్లుడ్ని కొట్టాను నాన్నా. అదీ ఈ చిన్న కర్రతో"

ఆ మాటలకు అన్నయ్య మొదట ఆశ్చ ర్యపోయాడు. ఆ పైన తలవంచుకున్నాడు. నేనూ ఆ పరిస్థితిలోనే ఉన్నాను. నమ్మక శాంత వైపు చూశాను. అలానే లక్ష్మి వైపు చూశాను.

"నాన్నా - బావ ప్రదీప్‌కు నువ్విచ్చిన చనువు, గారం, ఆడపిల్లల మీద తన అధికారం చూపించేటట్టు చేశాయిగానీ ప్రేమను పంచడం నేర్పలేదు. అసలు ప్రదీప్ నన్ను ప్రేమించలేదు. అలాగే నేనూ కూడా..." ఆగి పోయింది శాంత. కన్నీరు తుడుచుకుంది.

"చాల్లే" అన్నాడు కోపంగా అన్నయ్య.

"ప్రదీప్‌లో నాకు ఇంతవరకూ ప్రేమికుడు కనపడలేదు. అతగాడికి నన్ను చూస్తే ఎగతాళి. ఎగతాళి కూడా కాదు. ఈర్ష్య. ఇంకా ఇంకా..... ద్వేషం. ఇవన్నీ నేనెప్పుడో పసిగట్టాను. కానీ నువ్వు ప్రదీప్ నన్ను ప్రేమిస్తున్నాడని నన్ను నమ్మించబోయావ్! ప్రదీప్‌లో అసలు ఒకళ్ళను ప్రేమించే గుణమే లేదు. ముఖ్యంగా ఆడపిల్లలు ఏడిస్తే - ఆ పైన కన్నీరు కారిస్తే - అతని హృదయం సంతోషంతో మూలుగుతుంది. ఇంతకాలం మీ మర్యాదకూ, గౌరవానికీ, నా ఆడతనానికీ గౌరవం ఇచ్చాను, నాన్నా. కానీ ఓపికకు కూడా అంతం అనే మాట వర్తిస్తుంది" అని శాంత ఆగింది. తన కన్నీటిని తుడుచుకుంది ఆమె.

నేను శాంత వైపు ఆశ్చర్యంగా చూశాను. లక్ష్మి భయంగా చూసింది - మా ఇద్దరి వైపూ!!

"అయినా ప్రదీప్ బావను నేనెందుకు పెళ్ళి చేసుకోవాలి నాన్నా. నాకు కాలు వంకరా, కన్ను వంకరా.... ఏం లేవే?? పైగా నేను అప్సరసను. నేను ప్రదీప్ బావను వద్దని తిరస్కరించినా ఎవరూ నన్ను తప్పు పట్టరు"

"అది కాదు శాంతా... నువ్వు ఆవేశ పడొద్దు... వాడు మనకు పైవాడు కాదు. అల్లరి చేసినా, ఏమీ బాగుండకపోయినా మన ప్రదీప్ ప్రయోజకుడు"

"ప్రయోజకుడు కాదు - ప్రేమికుడయితే చాలని ప్రతీ ఆడపిల్లా తనకి కాబోయే భర్త గురించి అనుకుంటుందే? ఆ పని చేసే హక్కు మీరు నాకెందుకు ఇవ్వరు? నేను మళ్ళీ చెపుతున్నాను. నాకూ ప్రదీప్‌కూ పెళ్ళిచెయ్యాలని మీరు చూడొద్దు. బావ నాకు నచ్చలేదు. పూర్తిగా నచ్చలేదు. నిజం."

"అలా మాట్లాడకూడదు" అని మాత్రం అనగలిగాడు అన్నయ్య.

అప్పుడు నేను లక్ష్మి, శాంత, అన్నయ్య అందరం తల వంచుకునే ఆ గంభీర వాతావరణంలో మునిగి ఉన్నాం. కానీ మా మధ్య నుంచి ఓ మనిషి వెళ్ళినట్లు అక్కడ ఓ ఖాళీస్థలాన్ని వదిలినట్టు నేను పసిగట్టాను. వెళ్ళిన మనిషి నాకు ప్రదీప్‌లా అన్పించాడు. భయమేసింది. కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాను. కానీ వెళ్ళింది - ప్రదీప్ అని నేను ఖచ్చితంగా చెప్పలేనేమో??

"నువ్వు ఎక్కువగా మాట్లాడుతున్నావ్ శాంతా... ఆ మాటలు ఆపుజేసి లోపలికివెళ్ళు దయుంచి" అన్నాడు అన్నయ్య - ఆ తరువాత అన్నయ్య నా వేపు ఓ సారి చూశాడు.

నేను నెమ్మదిగా ఆ చోటు నుంచి తప్పుకున్నాను.

నాకు ప్రదీప్‌ను వెదకాలనిపించింది ఎందుకో! ఒంటరిగా ఆ సమయాన అత గాడిని వదలకూడదనీ అన్పించింది! అందుకే నేను అన్నయ్యా వాళ్ళింటికి వెళ్ళాను. వీధి తలుపు

దగ్గరకు వేసే వుంది. నేను హాలు దాటి లోపలికి వెళ్ళాను. నాకు తన పెట్టె సర్దుకుంటూ మొహం డీలాగా అయిన ప్రదీప్ కనిపించాడు.

"నువ్వు" అన్నాను... ఆ తర్వాత ఎలా మాట్లాడాలో నాకు తెలిసి రాలేదు.

"నేను మీ మాటలూ..... అదే శాంత మాటలూ ఏవీ పూర్తిగా వినకపోయినా అవి నా గురించే అని తెలిశాయి. నా ప్రవర్తనతో విసిగి కొందరు మాట్లాడితే మరికొందరు మాట్లాడలేదేమో?? కానీ..." అని కాసేపు ఆగాడు ప్రదీప్. ఆ తరువాత తిరిగి అన్నాడు.

"నిజమే. పెద్దమామయ్య మాటలు, నా తల్లితండ్రుల పెంపకం, ఆపైన నా విచ్చల విడితనం, యివన్నీ నా ప్రవర్తన మీదా, మాటల మీదా తమ ఆధిపత్యాన్ని చూపించాయి. అలాగే శాంత అందం, ఆమె మెత్తని తనం నన్ను ఉసికొల్పాయి. ముఖ్యంగా ఆ అందం నన్ను భయపెట్టింది కాబోలు అందుకే ఆమెను భయపెడితేగానీ నా భయం పోయినట్టుగా ఉండేది కాదు. ఆఖరిగా నా తెలివితేటలు, అతిని శాంత మీద ప్రయోగించేవాడిని. నిజం చిన్నమామయ్యా! అయినా నేను శాంతను నా మనసు నిండుగా ప్రేమించాను. ఏకాంతంలో ఆమెను గుర్తు చేసుకుంటేగాని నాకు ఆ రోజు వెళ్ళేదే కాదు. కానీ ఆమెను, ఆమె ప్రేమనూ, ఆమె ఆపేక్షను నాకు తెలియకుండానే దూరం చేసుకుంటున్నానని నాకు ఈ రోజు వరకు తెలియలేదు. నాకు ఎవరూ చెప్పనూ లేదు! అందుకు ప్రతిఫలం ఏమిటో ఈ సాయంకాలమే నాకు అర్థం అయింది. నిజమే నేను ప్రేమతో ఆటలాడాను. గేలి చేశాను. ఆఖరిగా దాన్ని అవమానించేనేమో కూడా!" అన్నాడు తల వంచుకుని ప్రదీప్.

నేను ప్రదీప్ వైపు చూశాను. అతని మొహం, కళ్ళు, మాటలు అన్నీ కూడా పశ్చాత్తాపంతో ప్రక్షాళన అవుతున్నట్లు, మనిషి ఓ కొత్తజన్మను తీసుకుంటూ పాతజన్మను తిరస్కరిస్తోన్నట్టుగా అనిపించింది.

"ఈ కన్ఫెషన్ ఆఫ్ ట్రూత్‌ను, నాకు తెలిసిరావడం కంటే శాంత కళ్ళన నవ్వు పడివుంటే చాలా బావుండేది ప్రదీప్! గాయపడ్డ ఆ చిన్న హృదయం తేరుకోగల్గేదేమో.. త్వరగా మనిషి అయిని నీకు దగ్గర కూడా అయ్యేదేమో" అన్నాను నేను. ఆ తర్వాత చిన్న అలజడి లాంటిది అయితే వెనక్కి తిరిగి చూశాను.

కళ్ళు తుడుచుకుంటూ శాంత కన్పించింది నాకు - అక్కడ!!

"నేను బావ మాటలు అన్నీ విన్నాను బాబయ్యా... సారీ, వెరి వెరీ, సారీ నన్ను క్షమించు ప్రదీప్" అంది. ఆ పైన శాంత తల వంచుకుంది. తల వంచుకునే నవ్వింది. అప్పుడు ఆమె నవ్వులో నాకు అప్యాయతా, అనురాగం కనిపించాయిగానీ భయం, బెదురు, అసహ్యం లాంటివి మచ్చుకైనా ఆనలేదు. కన్పించనూ లేదు!!

❖